
గ్రీనరీ @ హెచ్‌సీయూ




హెచ్‌సీయూలో గ్రీనరీ



చెరువులోని బండరాళ్లపై పక్షులు





డివైడర్ మధ్య పూల మొక్కలు

రాయదుర్గం: ఉన్నత విద్యకు, నాణ్యమైన పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటోంది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ. అంతేకాదు క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా కూడా గుర్తింపు పొందింది. వర్సిటీలోని రహదారులకు ఇరువైపులా పచ్చని చెట్లు, రకరకాల పూల మొక్కలతో పాటు వివిధ రకాల పక్షులకు, జంతువులకు కూడా నిలయంగా మారింది. ఈక్రమంలో ఏటా క్యాంపస్ అందాలతో కూడిన చిత్రాలతో కేలండర్ రూపొందించడం హెచ్‌సీయూ ఆనవాయితీ. ఈ కేలండర్ రూపొందించేందుకు ఇక్కడి విద్యార్థులు, ఫ్యాకల్టీ ఏడాది పొడవునా క్యాంపస్‌లోనే ఫొటోలు తీస్తుంటారు. వీటిలో అత్యుత్తమైన వాటిని కేలండర్‌లో ఉపయోగిస్తుంటారు. ఈక్రమంలో దాదాపుగా 800 చిత్రాలు ఎంట్రీ కోసం రాగా వాటిలో ఆకట్టుకున్న ఫొటోలతో రూపొందించిన 2024 కేలండర్‌ను ఇటీవల హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు ఆవిష్కరించారు.



రహదారులకు ఇరువైపులా పచ్చని అందాలు



రోడ్లపై రాలిపడిన పూలు



2024 కేలండర్ ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు

ఇంటింటా భోగి వెలుగులు



భోగి మంటలు వేస్తున్న ఎమ్మెల్యే గాంధీ కుటుంబ సభ్యులు

శేరిలింగంపల్లి: నియోజకవర్గం పరిధిలో తెల్లవారుజామునే పలు కాలనీలు, బస్తీలు ముఖ్యంగా అపార్టమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో భోగి మంటల సందడి కనిపించింది. ముఖ్యంగా మహిళలు తమ ఇంటి ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేసి.. పొంగలి వండి సంబరాలు చేసుకున్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: భోగి సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి భోగి రోజు తెల్లవారుజామునే లేచి మంటలు వేస్తున్నామన్నారు. ఇంట్లోని పాత వస్తువులు భోగి మంటల్లో వేయడం ఆనవాయితీ అని చెప్పారు. పనికిరాని ఆలోచనలను స్వస్తి పలికేందుకు ఈ సంప్రదాయం వచ్చిందని చెప్పారు.



నల్లగండ్ల అపర్ణా గ్రాండే ప్రాంగణంలో భోగి మంటలు వేసిన మహిళలు

అలరిస్తున్న సంక్రాంతి సంబురాలు




శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల, జంగమదేవరల హరి నామస్మరణలతో మాదాపూర్‌లోని శిల్పారామం మార్మోగుతోంది. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకొని భోగి పళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో ఆంపీ థియేటర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముంబాయికి చెందిన నాట్యగురువు రమేశ్ కోలి శిష్య బృందం శివారాధన అంశం, ప్రముఖ నాట్యగురువు మద్దాలి ఉష గాయత్రీ శిష్య బృందంచే ఏర్పాటు చేసిన గోదాకల్యాణం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. మరోవైపు గాంధీ శిల్ప జాతీయ మేళాలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు నగరవాసులు పోటీపడ్డారు.



60 వేల కుటుంబాలకు రామయ్య అక్షింతలు




కార్యక్రమంలో మాట్లాడుతున్న మాకెన హరీశ్‌రావు, హాజరైన స్థానికులు

నిజాంపేట్: అయోధ్య రామాలయం ప్రారంభం.. సంక్రాంతి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం ప్రగతినగర్‌లోని ఎన్టీఆర్ పార్కులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కూకట్‌పల్లి జిల్లా ప్రచార ప్రముఖ్ మాకెన హరీశ్‌రావు సంక్రాంతి ప్రాముఖ్యత, సూర్యభగవానుడి ఆరాధన, రామ జన్మభూమి అక్షింతల వితరణ, ప్రాణప్రతిష్ఠ తదితర అంశాలపై వివరించారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని అనుసరిస్తోందన్నారు. రానున్న కాలంలో భారత దేశం విశ్వ గురువుగా ఆవిర్భవించనుందన్నారు. అంతకుముందు ప్రగతినగర్‌లోని పది బస్తీలలో జరిగిన శ్రీరామజన్మభూమి అక్షింతల వితరణ జనసంపర్కం నివేదికను నగర సంఘచాలక్ తాడేపల్లి నాగేంద్రకుమార్ అందించారు. దాదాపు 60 వేల కుటుంబాలకు అక్షతల వితరణ జరిగిందన్నారు. వెయ్యి మంది రామ సేవకులుగా మారి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు.

చోరీల నియంత్రణకు ఆటో ప్రచారం



ఆటోలో ప్రచారం కోసం సిద్ధమైన పోలీసులు

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీ, బస్తీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని మియాపూర్ సీఐ ప్రేమ్ కుమార్ సూచించారు. సంక్రాంతికి ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు. ఇందుకోసం ఆటో ప్రచారంతో పాటు పోలీస్ గస్తీ పెంచామని తెలిపారు.

అధికారుల ఫోన్ నంబర్లు

ప్రేమ్ కుమార్, సీఐ: 94906 17129
కాంతారెడ్డి, క్రైమ్ సీఐ: 97033 37572
మన్సూర్, క్రైమ్ ఎస్సై: 87126 63177
మీనాకుమారి, సెక్టార్–1 ఎస్సై: 89853 96869
వెంకటేశ్వర్లు, సెక్టార్–2 ఎస్సై: 87125 68310
రాజు, సెక్టార్–3 ఎస్సై: 77022 04508
జగదీశ్, సెక్టార్–4 ఎస్సై: 87126 63170
దశరథ్, సెక్టార్–5 ఎస్సై: 98488 63569
పెట్రోలింగ్ మొబైల్–1: 83339 93414
పెట్రోలింగ్ మొబైల్–2: 83339 93415

అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

108లో మహిళ ప్రసవం

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామానికి చెందిన గొల్ల సంధ్యకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆదివారం ఉదయం 108 వాహనంలో తరలిస్తుండగా బచ్చుగూడెం చౌరస్తా సమీపంలోకి రాగానే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ ప్రశాంత్, డాక్టర్ శ్రీకాంత్ సూచనల మేరకు ఆమెకు కాన్పు చేశారు. తల్లీబిడ్డను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఈఎంటీ తెలిపారు. సంధ్య కుటుంబ సభ్యులు ఈఎంటీ ప్రశాంత్, పైలెట్ పండరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈపీఎఫ్ సభ్యుడిగా మల్లేశం

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ బోర్డును 42 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు బీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కమిటీలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశంను సభ్యుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈయన 45 సంవత్సరాలకుపైగా కార్మికుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక వేతనం ఒప్పందం చేసిన ఘనత మల్లేశంకు దక్కిందన్నారు.

కుస్తీ పోటీల్లో కారుణ్యకు స్వర్ణ పతకం



రామచంద్రాపురం (పటాన్‌చెరు): రెండు రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జరిగిన 11వ సౌత్ ఇండియా సీనియర్ కుస్తీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించినట్లు రామచంద్రాపురం పట్టణానికి చెందిన సుంకు కారుణ్య ఆదివారం తెలిపారు. ఈ ఏడాది తమిళనాడులో జరిగిన రెండు కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడండి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ముగ్గులకు హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టత ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని ముత్తంగి సాయిప్రియ కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆబేద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను ప్రతిబింబించేవిధంగా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, ఉపసర్పంచ్ లింగారెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మేరాజ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, రామకృష్ణ పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: సంక్రాంతిని పురస్కరించుకుని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ హోమ్స్‌లో ఏర్పాటు చేసిన గోదాదేవి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆదిత్య విల్లాస్ సమీపంలో ఆదివారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



మొదటి బహుమతి పొందిన మహిళకు వాషింగ్‌మెషీన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలి



చిన్నారులకు పతంగులు పంపిణీ చేసిన పాపిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పండుగ సందర్భంగా బస్తీలోని పలువురు చిన్నారులకు పతంగులు అందజేశారు. పతంగులను ఎగరవేసేటప్పుడు చిన్నారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు ధర్మారావు, అనంతరాములు, రామకృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, ఆనంద్, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింలు, శ్రీను, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా జనరల్ మెడిసిన్ కిట్ల పంపిణీ

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో హెల్పింగ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ మెడిసిన్ కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అశోక చక్ర వితంతు వికలాంగుల సంక్షేమ సంఘం వారికి నెలకు సంబంధించిన మెడిసిన్ కిట్ (జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ల నొప్పులు తదితర మందులు)ను అందజేశారు. అ రోజు మొదలు పెట్టిన ఈ మెడికల్ కిట్ ప్రతీ నెల కొనసాగుతుందని హెల్పింగ్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు టూటే విజయ్ కుమార్ అన్నారు. మొదటి నెల తన తండ్రి పదో వర్ధంతి సందర్భంగా తన వంతుగా ఈ మెడికల్ కిట్‌కు సహకరించిన శామ్యూల్ జాన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సత్యానారాయణ మందులపై అవగాహన కల్పించారు. అశోక చక్ర సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, సాజిద్, శ్రావణ్‌కుమార్, దేవి, సాత్విక, అర్చన, అరుణ్, బాబురావు, విజయ్, రేఖ, కరుణ, మంజుల, వీరేందర్ హాజరయ్యారు.



జనరల్ మెడిసిన్ కిట్‌ను పంపిణీ చేస్తున్న సభ్యులు

భారీగా పెరిగిన పతంగుల ధరలు



తారానగర్ మార్కెట్‌లో పతంగులు, దారం విక్రయాలు

శేరిలింగంపల్లి: సంక్రాంతి అంటేనే భోగి మంటలు, ముగ్గులతో పాటు పతంగులు ఎగురవేయడం ఆనవాయితీ. ఈక్రమంలో ఏటా శేరిలింగంపల్లిలోని తారానగర్ మార్కెట్‌లో ప్రత్యేకంగా పతంగులు, మాంజా, దారం విక్రయాలు భారీగా కొనసాగుతాయి. చుట్టూ ఉండే కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీవాసులు ఇక్కడికే వచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. అయితే, పతంగుల రేట్లు భారీగా పెరిగాయి. ఆదివారం తారానగర్ మార్కెట్‌లో ఒక్కో పతంగు రూ.5 నుంచి రూ.80 వరకు విక్రయించారు. అదేవిధంగా కేవలం దారంతో తయారు చేసిన స్థానిక మాంజా ఒక్కొక్కటీ రూ.600 నుంచి రూ.800 వరకు ఉండటం విశేషం. గతంలో విక్రయాలు బాగా సాగేవని, ప్రస్తుతం అంతగా కొనుగోళ్లు లేవని వ్యాపారులు చెబుతున్నారు.

ఆలయాల్లో సంక్రాంతి పూజలు



శివసాయి క్షేత్రంలో..

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఇందులో భాగంగా గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను ఆదివారం ఉదయం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి, గణపతి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయ స్వామి, ఇతర దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, అర్చకుల పర్యవేక్షణలో ఈ పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీ



డిపోలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

మూసాపేట: టీఎస్ఆర్టీసీ కూకట్‌పల్లి డిపోలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం మహిళా ఉద్యోగులకు రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీకి డిప్యూటీ ఆర్ఎం కవి, కూకట్‌పల్లి డీఎం ఇషాక్ మహమ్మద్ బిన్, సీఐ శ్రీలత, టీఐటీ సావిత్రి, ఎస్‌టీఐ వెంకటేశంలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన ఉద్యోగులను అభినందించారు. మొదటి బహుమతి కండక్టర్ గౌతమి, ద్వితీయ బహుమతి కండక్టర్ శైలజ, తృతీయ బహుమతి కండక్టర్ శోభాలకు అందజేశారు. అదే విధంగా పాల్గొన్న ఉద్యోగులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

నేడు ఆలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

కూకట్‌పల్లి: అయోధ్యలో ఈనెల 22న రామమందిర ప్రారంభోత్సవానికి ముందు, భారతదేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు, సోమవారం ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి రామాలయ ప్రాంగణంలో కూకట్‌పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్‌రావు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు, కూకట్‌పల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విజయగణపతికి కేజీ వెండి విరాళం



కేజీ వెండిని విరాళంగా అందజేస్తున్న వేణుగోపాల్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 9వ ఫేజులోని విజయ గణపతి దేవస్థానంకు కేపీహెచ్‌బీ కాలనీ వాకర్స్, యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి పి.వేణుగోపాల్–1 కేజీ వెండిని స్వామివారికి విరాళంగా అందజేశారు. ఆదివారం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వెండిని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు చేతులు మీదుగా దేవాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హనుమ ధ్వజ'కు డిమాండ్



జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో అమ్మకానికి రెడీగా ఉన్న జెండాలు

జగద్గిరిగుట్ట: జై శ్రీరాం...జై హనుమాన్.. జెండాలకు భలే క్రేజ్ ఏర్పడింది. ప్రతీ ఇంటికి శ్రీ రాముడి అక్షింతలు చేర్చాలన్న సంకల్పంతో రాజకీయాలకు అతీతంగా అందరూ తిరుగుతుండటంతో ఈ జెండాలకు క్రేజీ ఏర్పడింది. జగద్గిరిగుట్టలోని పలు షాపులతో పాటు చింతల్, షాపూర్ నగర్, సూరారం తదితర ప్రాంతాలలో ఈ జెండాలను విక్రయిస్తున్నారు. గత వారం నుంచి అమ్మకాలు బాగా ఉన్నాయని వ్యాపారస్తులు తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ అమ్మకాలు ఇంకా జోరందుకుంటాయని ముందే స్టాక్ తెచ్చుకున్నట్లు వారు తెలిపారు.

మేయర్ నీలారెడ్డికి అభినందనలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్–23 అవార్డు వచ్చిన నేపథ్యంలో ఆదివారం కార్పొరేటర్ మేకల వెంకటేష్, కో.ఆప్షన్ సభ్యుడు తలారి వీరేష్ ఆధ్వర్యంలో మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే అవార్డు సాకారమైందన్నారు.